# ★★★నంగనాచి

★రచన: రుద్రావఝుల సన్యాసిరావు★

★

కృష్ణమూర్తి భార్య పుట్టింటినుండి తిరిగి రాగానే ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా పలకరించి ఎవరిమానాన్ని వాళ్ళు వెళిపోయారు ఆఖరు వరకూ ఉన్న శ్యామల "మీరెప్పుడూ మీ ఆయన్ని ఒదిలి పుట్టింటికి వెళ్ళకండి వరుగులెడితే మీ పండువంటి సంసారం పాడైకూర్చుంటుంది ఎందుకు చెప్పేనో తెలుసుకోండి" అంటూ అన్నం వార్చుకోవాలంటూ అక్కడనుండి తప్పుకుంది.

ఇది విన్న కృష్ణమూర్తి భార్య నివ్వెరబోయింది. నివ్వెరబోవడమేమిటి—నుదిటిని నెత్తురు చుక్క లేదు. ఇలా అన్నందుకు శ్యామలమీద కోపంకూడా వేసింది.

కృష్ణమూర్తి మంచి తెలివైనవాడు అందగాడు—నొక్కులు తిరిగిన గిరజాల జుత్తు భావకవిలా కనబడతాడు చిన్న మీసం. చిరునవ్వు ముఖంలో తాండవించుతుంది ఎవరైనా ఇట్టే పరిచయులవుతారు.

కృష్ణమూర్తి భార్య నాలుగు వారాలు పుట్టింటికి వెళ్ళరాగానే భర్త నాలుగు వారాల బియ్యం రేషను ఇంట్లో ఉంచడం, ఇబ్బంది పడుతున్న పంచదారను పొదుపుచేసి జాగ్రత్తపరచడం, తాను వస్తానని తెలియగానే ఇంట్లో ఇబ్బంది లేకుండా నాలుగు కొని ఇంట్లోఉంచడం—తనొచ్చేరైలుకు స్టేషనుకు వచ్చి దిక్కుమాలిన రైలు ఆరోజు ఆలస్యంగా వచ్చినా కనిపెట్టుకొని ఉండి—రైలు రాగానే పెట్టెలన్నీ కలియచూచి తనున్న పెట్టె దగ్గరకు త్వరగావచ్చి సామాను అందుకొని, పిల్లలనీ సంకపెట్టి—ఆలస్యం కాకుండా జట్కా మాట్లాడి—తను అలసిపోయానని కాఫీతెప్పించి ఒద్దన్నా బలవంతంచేసి త్రాగింపించి పిల్లలకు పట్టించిన భర్తను లోలోనే పొగడుతుంది దిష్టి తగిలిపోతుందని అతనితో అనలేదు

ఇంతమంచి కృష్ణమూర్తిమీద చాడీలు చెప్పినందుకే చికాకుపడ్డాది ఆమె. ఇంతవరకూ తన మీద కృష్ణమూర్తికి ప్రేమ ఉందా లేదా అన్న ప్రశ్న ఆమెకు ఎప్పుడూ తట్టలెదు. సంసారంలో తన పిల్లలే చిహ్న కృష్ణమూర్తి ప్రేమకు—ప్రేమగల భర్తలు భార్యలకు ఇంతకంటే చేస్తున్న ఉపకారమేమిటి? చల్లగా మాట్లాడడం—చక్కని పిల్లలు కనుకోవడం—కృష్ణమూర్తి వీటికి విరుద్ధంగా లేడే?

కృష్ణమూర్తి మంచి కాకపోతే, తనంటే ప్రేమ లేకపోతే స్టేషనుకే రాకపోను. అసలు ఎంతమంది భర్తలు భార్యలు ఒస్తున్నారంటే ఉపేక్షించి సినీమాలకి పోవడంలేదు.

అయితే శ్యామల ఎందుకు అలా అనాలి? పనిమేరా వచ్చి చెప్పిందికదా—కారణం? అదే సమంగా తెలీలేదు కృష్ణమూర్తి భార్యకు. శ్యామల చెప్పినదానివల్ల కృష్ణమూర్తిమీద పోటీ చెప్పినట్టు గ్రహించింది.

కొందరు పైకి బాగున్నట్టు కనబడతారు. కొంచెం లోతుకు పోయిచూస్తే వాళ్ళ చేసేపనులు చెప్పలేం అయితే కృష్ణమూర్తిననుకుంటే పాపం పంచుకోవడమే.

కృష్ణమూర్తికి ఏ దురలవాట్లూ లేవు చుట్ట త్రాగడు. సిగరెట్టు పీల్చటు—కాఫీ క్లబ్బుకయినా

వెళ్ళరు—అధమం అటా పొడుం అయినా కొని పిల్చే అలవాటు లేదు. ఇంత మంచిమనిషిమీద ఇలా చెప్పడంలో గల కారణం?

తను వస్తున్నానని తెలియగానే వాసననూనె సీసా కొని, స్నో కొని పౌడరుడబ్బా కొని బీరువాలో ఉంచడమే కాకుండా పువ్వులుకూడా పక్కమీద జల్లించి ఉంచిన కృష్ణమూర్తిమీద, కామ తన భర్త నుద్దేశించి శ్యామల చెప్పడం భరించలేకపోయింది

తనను మనసారా ప్రేమించిన కృష్ణమూర్తి తన ముద్దులగుమ్మను, తన నిజభర్తను, ఒంటరి ఉండడం కష్టమే—అయితే సంసారం పాడవుతుందని చెప్పిన శ్యామల పలుకులకు సరియైన జవాబు రాలేదు—అడక్కుండా ఊరుకోలేకపోయింది—

గంజి వారుస్తున్న శ్యామల దగ్గరకువెళ్లి "ఎందుకండీ అలా అన్నారు" అంది కృష్ణమూర్తి భార్య—

మీరు పుట్టింటికి వెళ్లి నాలుగు వారాలయిందా? నాలుగు రోజులైనా ఇంట్లో పడుకోలేదు. ఎవరో లక్ష్మి అన్న పిల్ల ప్రతిరోజూ వచ్చిపోతూఉండేది—కని ఆదివారాలు శలవలలో వారి సంగతి చెప్పనక్కరలేదు—ఊరంతా పుకారుగా ఉంది ఆమెతో...." అంది శ్యామల

కృష్ణమూర్తి భార్యమీద ఏటంబాంబు పడ్డట్టయింది. మంచంమీద మల్లెపూవులు బీరువాలో వాసననూనె, స్నోలు, చిక్కుమాలిన మిగతావి కొనడం లక్ష్మికే అయివుంటాయి. • ఛీ! ఛీ! నమ్మకూడదు మగవాళ్లని—శ్యామల ఎంతమంచి—
• కృష్ణమూర్తి ఎంత నంగనాచి??




# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు 1

★

(ప్రచురణ: ప్రతి ఆదివారం)

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

★

* అర్ధసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు

* 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుచెట్టివీధి, జి.టి. మద్రాసు అని వ్రాయవలెను. వ్యక్తులపేర పంపవద్దు.

—మేనేజరు